



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఆరోగ్యశ్రీ నిధులు తక్షణమే విడుదల చేయాలి

ఆరోగ్య శ్రీ ద్వారా ప్రజలకు వైద్య సేవలను కొనసాగించాలని, బకాయి పడ్డ ఆరోగ్య శ్రీ నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వార్త మెయిన్‌లో

వలసలతో గ్రామాలు ఖాళీ

- బోసిపోయిన రచ్చకట్టలు
- ఏ గ్రామానికెళ్లినా తాళమేసిన ఇళ్లే..!
- విద్యార్థుల్లేక తరగతి గదులు ఖాళీ
- ఇంటికి కాపలాగా వృద్ధులు

మండలంలో వలసలతో ఊళ్లకు ఊళ్లే ఖాళీ అవుతున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా తాళమేసిన ఇళ్లే దర్శనమిస్తున్నాయి. రచ్చకంటలు బోసిపోయి ఉంటున్నాయి. ఇంట్లో అందరూ వలస వెళ్లడంతో కాపలాగా వృద్ధులు మాత్రమే కనిపిస్తున్నారు. విద్యార్థుల్లేక పాఠశాలలోని తరగతి గదులు బోసిపోతున్నాయి. ఈఏడాది ఉల్లి పంటకు సరయిన గిట్టుబాటు ధర లేక పూర్తిగా నష్టం వాటిల్లింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి సైతం ఎర్రబారి చెట్లు కుళ్లిపోతున్నాయి. ఓవైపు నష్టం.. మరోవైపు అప్పులు... చేసేదేమీ లేక గ్రామాల్లో పిల్లాపాపలతో కలిసి పొట్ట చేత పట్టుకుని బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. బడిలో పాఠాలు వింటూ బలపం పట్టాల్సిన చిన్నారుల చేతులు పొలంలో పత్తి ఏరేందుకు వెళు తున్నాయి.



బొలెరో వాహనంలో వలస వెళ్తున్న కూలీలు



చింతకుంటలో ఇంటికి కాపలాగా ఉన్న వృద్ధురాలు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో నేలకోసిగి, వందగల్లు, సజ్జలగూడెం, పల్లెపాడు, చింతకుంట, కామన్ దొడ్డి, దుద్ది, కోల్మాన్ పేట, డి.బెళగల్, చిన్నభూంపల్లి తదితర గ్రామాలు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. ప్రతి గ్రామం నుంచి 100 నుంచి 200 కుటుంబాలు ఇప్పటికే వలస వెళ్లాయి. మండలంలో రెండు వేల కుటుంబాలకు పైగానే వలస వెళ్లారు. స్థానికంగా పనులు లేకపోవడంతో గుంటూరు, హైదరాబాదు, బెంగళూరు, కర్నాటక వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లారు. బోసిపోయిన రచ్చకట్టలతో, పొట్టకూటి కోసం వలసలతో ఖాళీ అయిన గ్రామాలతో పచ్చగా ఉన్న గ్రామాలు కళావిహీనంగా మారాయి. ఇళ్ల వద్ద వృద్ధులను వదిలి వెళ్తున్నారు. కొంతమంది పిల్లలను వెంట తీసుకెళ్తూ.. మరి కొంతమంది వృద్ధులకు, ఇంటికి కాపలాగా పిల్లలను వదిలి వెళ్తున్నారు. వలస వెళ్లిన ప్రాంతంలో కిలో పత్తి విడిపిస్తే రూ.10 నుంచి రూ.15 కూలి ఇస్తారు. పిల్లాపాపలు కుటుంబమంతా కలిసి పొలంలో పని చేస్తే రోజుకు రూ.2 నుంచి రూ.3 వేల వరకు రోజు కూలి వస్తుంది. మరికొంతమంది పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు రోజూ రైలులో 1,000 నుంచి 1,500 మంది కూలి పనుల కోసం వెళ్లి వస్తున్నారు. మరి కొంతమంది పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రాలకు పత్తి విడిపించేందుకు, పొలం పనులకు రోజూ ఉదయాన్నే బొలెరో వాహనంలో వెళ్లి సాయంత్రానికి తిరిగి వస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మండల రైతులు, కూలీల జీవితాలు మారడం లేదని వామపక్షాల నాయకులు ఆవేదనతో పాటు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మండలంలో 5 వేల మందికి ఉపాధి కల్పించే విధంగా చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కొంతవరకు వలసలను అరికట్టవచ్చని గ్రామస్తులు కోరారు.



విద్యార్థుల్లేక ఖాళీగా ఉన్న పాఠశాల తరగతి గది

అమ్మానాన్నలు వలస వెళ్లారు

- కుమారి, విద్యార్థి, చింతకుంట గ్రామం




మాది చింతకుంట గ్రామం. నేను ఐదో తరగతి చదువుతున్నాను. అమ్మానాన్నలు, మా కుటుంబమంతా కలిసి తెలంగాణకు వలస వెళ్లారు. ఇంటి దగ్గర ఎవరూ లేరు. మా అవ్వతో పాటు నేను ఇక్కడే ఉండి చదువుకుంటున్నాను. ఈ ఏడాది మా పొలంలో పూర్తిగా నష్టం వచ్చిందని, అప్పులు తీర్చడానికి వలస వెళ్తున్నట్లు అమ్మానాన్నలు చెప్పారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- రాముడు, సిఐటియు మండల కార్యదర్శి, కోసిగి



కోసిగి మండలమంటేనే వలసలకు మారుపేరు. ఇక్కడ మండలంలో ఉన్న రైతులు అన్ని గ్రామాల నుంచి ప్రతిదాని వలస వెళ్తుంటారు. వలసలను నివారించేందుకు గతంలో సిపిఎం ఆధ్వర్యంలో పలు రాస్తారోకోలు, ధర్నాలు చేసినా ఇప్పటివరకు ఫలితం ఏమీ లేదు. ప్రభుత్వాలు మారుతున్నా మండల ప్రజల జీవితాలు మారడం లేదు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కొంతవరకు వలసలను అరికట్టవచ్చు. కొంతమందికి ఉపాధి కలిగించే విధంగా అవకాశం ఉంటుంది. ప్రభుత్వం స్పందించి చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచాలి

-కలెక్టర్ డా.ఏ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, సెరికల్చర్, మార్కెటింగ్, పశు సంవర్ధక, డిఆర్‌డిఎ, మెప్మా, నాబార్డు, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ఇంటరాక్టివ్ సెషన్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ, మండల స్పెషల్ అధికారులు వారికి కేటాయించిన మండలాలకు వెళ్లిన సమయంలో వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల అన్ని శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, పథకాల గురించి సంపూర్ణ అవగాహన ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ లకు సంబంధించి రైతులకు నష్టం రాకుండా పంటలు సాగుచేసే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. రైతులు ఒకే పంట మీద ఆధారపడకుండా 2,3 రకాల పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కేవలం పంట మీదే ఆధారపడడం కాకుండా గొర్రెలు, మేకలు, పాడి పశువులను కూడా పెంచుకునేలా రైతులను ప్రోత్సహించేలా పశు సంవర్ధక శాఖ, ఎల్‌డిఎం, డిఆర్‌డిఎ అధికారులను ఆదేశించారు. నాణ్యమైన విత్తనాలు, నూతన సాంకేతికత, ఎరువులు, పురుగుమందుల వినియోగం తదితర అంశాల గురించి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వివరించాలన్నారు. బత్తాయి, నిమ్మ, దానిమ్మ తదితర ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ను పెంచాలన్నారు. ఆయిల్ పామ్ సాగును కూడా పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సంఖ్యను మరింత పెంచి, తద్వారా రైతులకు ఆదాయం పొందేలా విస్తృతంగా కార్యక్రమాలను చేపట్టే విధంగా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో పాలు, గుడ్ల ఉత్పత్తి కూడా పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. నాబార్డు ద్వారా రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులను వినియోగించుకునేలా ఆయా శాఖల అధికారులు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా చెక్ డ్యాములు, మార్కెట్ యార్డ్‌లో మౌలిక వసతులు, కోల్డ్ స్టోరేజీలు తదితర నిర్మాణాలకు ఈ నిధులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్టాటప్ ఇండియా పథకంపై అవగాహన కల్పించి, ఎస్సీ ఎస్టీ, మహిళలకు రుణాల మంజూరు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, సిపిఒ భారతి, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, కర్నూలు ఆర్‌డిఒ సందీప్, పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, ఎల్‌డిఎం రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నాటికి మున్సిపల్ భవనం పూర్తి చేయాలి

- పనులను పరిశీలించిన మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన నూతన కార్యాలయ నిర్మాణ పనులను కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత మున్సిపల్ కార్యాలయం చిన్నదిగా, ఇరుకుగా ఉన్నందువల్ల పరిపాలనా సౌకర్యాన్ని మెరుగుపరుచేందుకు, ప్రజలకు మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు కొత్త భవనం తక్షణం పూర్తి చేయాల్సిన అవసరముందని మంత్రి చెప్పారు. రూ.28 కోట్లతో ఈ భవనాన్ని చేపడుతున్నామని, సుమారు 50శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. భవనం 3 అంతస్తులుగా ఉండగా, పూర్తి విస్తీర్ణం సుమారు 3.12 ఎకరాలు ఉందన్నారు. ఇటివలే తొలి బిల్లులు మంజూరు చేయించానని, ఇక పనులలో ఆలస్యం జరగకుండా వీలైనంత వేగంగా పనులను పూర్తి చేస్తామన్నారు. కమిషనర్ పి.విశ్వనాథ్ మాట్లాడుతూ .. పెరిగిన జనాభాకు అనుగుణంగా పాత కార్యాలయం సరిపోనందున నూతన కార్యాలయాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజాసౌకర్య దృష్టిలో పెట్టుకొని నిర్మాణ పనులను నాణ్యతతో వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామన్నారు. పాత మున్సిపల్ కార్యాలయాన్ని త్వరలో వెంకటరమణ కాలనీ వద్ద ఉన్న ఫ్రైడ్‌ప్లాజాకు తరలించి పాత భవనాన్ని కూల్చుతున్నామన్నారు. మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఇఇ గిరిరాజ్, టిఎఇ ఖాసింవలి, కార్పొరేటర్ కురబ.పరమేష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు సహకరించండి

- బాధితులతో రాష్ట్ర మంత్రి టిజి.భరత్
- భూమి, భవనాలు కోల్పోయే బాధితులకు నష్టపరిహారం

నగరంలోని కిడ్స్‌వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు చేపట్టే రహదారి విస్తరణకు భూమి, భవన యజమానులు సహకరించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ కోరారు. నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి రహదారి విస్తరణ బాధితులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్‌రద్దీ పెరుగుతోందని, దాన్ని తగ్గించేందుకు రహదారి విస్తరణ అవసరం ఉందన్నారు. కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జివరకు రహదారి విస్తరణ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందని, బాధితులందరూ సహకరిస్తే పనులు వేగంగా పూర్తి చేయగలమని తెలిపారు. మొత్తం180పైగా ఆస్తులు విస్తరణలో ప్రభావితమవుతున్నాయని, ప్రస్తుతం ఉన్న రహదారిని 50 అడుగుల వరకు విస్తరించనున్నట్లు చెప్పారు. మొదటి దశలో 175 మీటర్ల వరకు విస్తరణ పనులు చేపడుతున్నామని వివరించారు. ఆస్తి కోల్పోయే బాధితులకు ఆస్తి విలువకు నాలుగు రెట్లు విలువైన టిడిఆర్ బాండ్‌లు జారీ చేస్తామని, భవనాల నష్టం విషయంలో ఆర్అండ్‌బి శాఖ తరపున నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. పూర్తిగా ఆస్తి కోల్పోయే వారికి నగర పరిధిలోనే ప్రత్యామ్నాయ స్థల కేటాయింపు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని, సందేహాలను అధికారులు నివృత్తి చేస్తారని పేర్కొన్నారు. త్వరితగతిన బాధితులు ముందుకు వస్తే, అందరికీ ఒకేసారి న్యాయం చేయడానికి వీలవుతుందన్నారు. అందరూ నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రి కోరారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జ్ ఎస్ఇ శేషసాయి, ఎంఇ మనోహర్ రెడ్డి, డిసిపి వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్‌బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న, కార్పొరేటర్లు పరమేష్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మంత్రి భరత్, కమిషనర్ విశ్వనాథ్



బురద నీటితో చేపలు పట్టినిరసన తెలుపుతున్న పిపిఎస్ఎస్ నాయకులు, స్థానికులు

నీటి గుంతలతో ప్రమాదాలు

రూ.కోటికి పైగా ఆదాయం వస్తున్నా పట్టించుకోని


ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విష్ణుటౌన్‌షిప్‌తోపాటు పలు కాలనీలకు ఉపయోగపడే 60 అడుగుల రోడ్డుపై సిమెంట్ రోడ్డు నిర్మించాలని పాలకుల చుట్టూ తిరిగినా.. ఎవరు స్పందించలేదు. అధికార ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు దొందూదొందే అనే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని న్యాయవాది ఆర్.చంద్రశేఖర్, అపార్టుమెంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.ఆజాద్, కె.మల్లికార్జున, పట్టణపౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, మెకానిక్‌లు అసోసియేషన్ నాయకులు ఎస్.హైదర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో ప్రధాన రోడ్డుపై పర్యటించి చేపలు పడుతూ నిరసన తెలిపారు. అనంతరం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఆందోళన చేశారు. నాయకులు మాట్లాడుతూ ఇంటి పన్నుల రూపంలో ఏటా రూ.కోటి పైగా నగరపాలక సంస్థకు ఆదాయం వస్తున్నా.. రోడ్డు వేయాలని స్పృహ అధికారులకు లేకపోవడం బాధా కరమన్నారు. జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు ఈ రోడ్డుపై వెళ్లడమే తప్ప స్పందించడం లేదన్నారు. గత ప్రభుత్వం..ప్రస్తుత ప్రభుత్వంతో పాటు నగరపాలక సంస్థకు చెందిన పాలకవర్గం కూడా ఈ ప్రాంత అభివృద్ధిపై శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. వర్షం నీరు నిలబడి గుంతలు కనిపించక లైట్లు వెలగక ప్రతిరోజు అనేకమంది కిందపడి లేచిపోతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉండడమే మేము చేసిన పాపమా? అని ప్రశ్నించారు. వృద్ధులు గర్భిణీ స్త్రీలు పక్క వీధి రోడ్ల మీదుగా నగరానికి చేరుకుంటున్నారని అన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విష్ణు టౌన్షిప్‌లో సిమెంట్ రోడ్డు వేయాలని కోరారు.స్థానిక కాలనీ అసోసియేషన్ల ప్రతి నిధులు మహమ్మద్ యూనుస్, ఎస్.రఘురామిరెడ్డి, ఎం.ముస్తఫా, కె.బ్రహ్మం, ఎస్.అన్వర్ బాష, ఎస్.సత్యనారాయణ, పివి మధుసూదన్ రావు, సివి వర్మ, ఈ లక్షణ గౌడు, కె.బుచ్చేశ్వరరావు, ఎ.ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవ వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి -కోడుమూరు :

నియోజకవర్గస్థాయిలో రాజ్యాంగ ఆమోద దినోత్సవ పోటీలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కోడుమూరు మండల కేంద్రంలోని కొండపేట ప్రాథమిక పాఠశాలలో 8 నుంచి పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయిలో వ్యాసరచన పోటీలు ఎంపిడిఒ ఏసీ రాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలో విజేతలుగా ఎస్. మంజుల జడ్‌పిహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్ కోడుమూరు, సాయి మహిధర్ ఎపిఆర్ఎల్‌డబ్ల్యు గోరంట్ల, లోకేశ్వర రెడ్డి, జెడ్‌పిహెచ్ఎస్ సి–బెళగల్ వరుసగా మొదటి మూడు స్థానాలలో విజేతలుగా నిలిచారని ఎంఇఒ వసంత భాయి తెలిపారు. సిఆర్‌పిలు సోమేశ్వరి, భాస్కర్, సిబ్బంది మొహమ్మద్ రఫీ, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతకు బహుమతి ప్రదానం

మౌలిక సదుపాయాలు కరువు

- -కష్టాల్లో పందిపాడు ఇందిరమ్మ కాలనీ
- -కొరవడిన రోడ్లు, కాలువలు, తాగునీరు
- -వెలగని విద్యుత్ దీపాలు
- -కాలనీవాసుల జీవనం దుర్భరం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని పందిపాడులో కాంగ్రెస్ ప్రభుత్వం 2009లో ఇందిరమ్మ పేరుతో కాలనీ ఏర్పాటు చేసింది. రూ.2100 ప్రకారంగా 4000 మంది డిడిలు చెల్లించినా 2500 మందికి స్థలాలు కేటాయించారు. అందులో వందకు పైగా కుటుంబాలు గృహాల నిర్మించుకొని కాపురం చేస్తున్నారు. 300 దాకా బేస్‌మెంట్లు వేసి వదిలేశారు. ఖాళీ ప్లాట్లలో వర్షాలు పడడంతో పిచ్చి మొక్కలు, కంప చెట్లు మొలిచి చిట్టడవిలా తయారైంది. ఆ ప్రాంతాల్లో పాములు నివాసం చేస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అక్కడి తీవ్రమైన సమస్యలను చూసి ప్రజలు ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు రావడం లేదు.

అయినా ధైర్యం చేసి కొందరు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకొని వంద కుటుంబాలకు పైగా ఉంటున్నారు. కాలనీలో రోడ్లు, కాలువలు, మంచినీటి సౌకర్యం లేదు. మరోవైపు వీధిలైట్లు వెలగక చీకట్లో పాములు, తేళ్ల దోమలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. రాత్రి సమయంలో మందుబాబులు వచ్చి తాగడంతో మహిళలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. పైపులు,సిమెంటు, మోటార్ల దొంగతనాలు కూడా జరుగుతున్నాయి. ఆ ప్రాంతం నల్ల రేగడి కావడంతో వర్షం పడినప్పుడు రోడ్లన్నీ బురదమయమై కాలనీ నుండి నగరంలోకి రావడానికి చాలా ఇబ్బందులు పడాల్సిన దుర్భర పరిస్థితిలో ప్రజలు ఉన్నారు. తాగునీటి కోసం కిలోమీటర్ దూరంలో ఉన్న ముజఫర్ నగర్, లేదా చెన్నమ్మ సర్కిల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. దామోదర దాల్‌మిల్ నుండి రోడ్డు లేకపోవడంతో గ్యాస్ సిలిండర్లు తెచ్చే వాహనాలు కాలనీకి రావడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాలువలు లేకపోవడంతో ఇంకుడు గుంతలు తవ్వుకొని ఉంచుకుంటే, ఆ నీరు రోడ్లపైకి వచ్చి మహిళలు ఘర్షణ పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. మురుగునీరు నిలిచి దోమలు విపరీతంగా పెరిగి దోమ కాటుకు గురై శరీరం అంత దద్దుర్లు వస్తున్నాయి. విషజ్వరాలు వచ్చి ఆసుపత్రికి వెళ్లాలంటే ముజఫర్ నగర్ లేదా చెన్నమ్మ సర్కిల్ కు రావాల్సిన దుస్థితి ఉంది. నగరపాలక సంస్థ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఏమాత్రం స్పందించడం లేదు. కాలనీలో కుక్కల బెడద కూడా ఎక్కువగా ఉంది. ఇటు దొంగలు, అటు కుక్కలు బెడదతో మహిళలు రాత్రిపూట బయటికి రాలేక పోతున్నారు. కనీసం వారానికి ఒక్కసారైనా దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. బోర్ వాటర్ వల్ల చర్మ రోగాలు వస్తున్నాయి. కూలీ, మట్టి పని చేసుకొని బతికే వాళ్లకు కనీస వసతులు కల్పించి ఆదుకోవాలి.



రోడ్డు దుస్థితి

కనీసరౌకర్యాలు కల్పించాలి

అన్వర్‌బాష ,పందిపాడు ఇందిరమ్మ కాలనీ



మూడేళ్లుగా ఇక్కడే కాపురం ఉన్నాం. కలెక్టర్, కమిషనర్‌కు అనేక సారు వినతులు ఇచ్చాం. సమస్యలకు పరిష్కార మార్గం చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి .

మా ఆరోగ్యం పట్టించుకోండి


పద్మ,పందిపాడు ఇందిరమ్మ కాలనీ



ప్రభుత్వాలు,అధికారులు మారుతున్న కాలనీ అభివృద్ధికి నోచుకోలేదు. దోమల కారణంగా విషజ్వరాలు వచ్చి ఆరోగ్యాలు చెడిపోతే చూపించుకోవడానికి వైద్య సౌకర్యాలు లేవు. కనీసం రోడ్లు లేక రాత్రిపూట ఏదయినా ఆరోగ్యం సమస్య వస్తే వైద్యం చేయించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. విషపురుగుల బారిన పడకుండా పిచ్చి మొక్కలను తొలగించాలి. 15రోజులకు ఒకసారి మా కాలనీకి 104 వాహనాన్ని పంపాలి.

పోరాడితే జిరాక్స్ పట్టాలిచ్చారు

సిహెచ్ సాయి బాబా , సిఐటియు నగర కార్యదర్శి



పోరాటాల ఫలితంగా ఇందిరమ్మ కాలనీ లబ్ధిదారులకు జిరాక్స్ పట్టాలిచ్చారు. మౌలిక వసతులు కల్పించాలని పోరాడిన ఫలితంగా వీధి దీపాలు, స్తంభాలు వేశారు. కాలనీకి వెళ్లడానికి ప్రధాన రహదారి రోడ్‌లో కల్వర్టులు ,మంచినీరు రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇల్లు కట్టుకునే వారికి రూ. ఐదు లక్షల రుణం ఇవ్వాలి. మౌలిక వసతులు కల్పించాలి. పేదలకు నివాసయోగ్యంగా మార్చాలి.

రోడ్డు మంజూరు అయింది

కమిషనర్ పి.విశ్వనాథ్



పందిపాడు ఇందిరమ్మ గృహాలకు వెళ్లేరోడ్డు వేసేందుకు కౌన్సిల్లో తీర్మానం చేసి రూ.35 లక్షలు మంజూరు చేసాం. టెండర్ అయింది. మూడు నెలల్లో యుద్ధ ప్రాతిపదికన రోడ్డు, మౌలిక వస తులు కల్పిస్తాం. అందరూ కట్టుకోవాలి

బస్ ప్రమాద బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలి

- బాధితుడు గుణ సాయి కుమార్ బంధువులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఔఈనెల24న హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తూ చెట్ల మల్లాపురం దగ్గర బైకును ఢీకొని అగ్ని మంటలలో కాలిపోయిన వి కావేరి ట్రావెల్స్ బస్ ప్రమాదంలోంచి ప్రాణాలతో బయటపడి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఐసియులో చికిత్స పొందుతున్న ప్రయాణికుడు గుణసాయి కుమార్ కుటుంబన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారి బంధువులు నాగార్జున, మహేంద్ర కోరారు. వారు జిజిహెచ్ లో విలేకర్లతో మాట్లాడుతూ వి కావేరి ట్రావెల్స్ బస్‌అగ్ని ప్రమాదంలో గుణసాయికుమార్ ప్రాణాలతో బయటపడి పొగ ఎక్కువగా పీల్చుకోవడంతో శ్వాసకోస ఇతర సంబందిత సమస్యలపై గత ఆరు రోజులుగా ఇప్పటికి ఐసియులో చికిత్స తీసుకుంటున్నాడని, అతను గ్లాస్ డోర్స్ భిగిస్తూ పని చేసే వాడని అదే పని పై బెంగళూరుకు వెళ్తు ప్రమాదంలో చిక్కుకున్నారని అన్నారు. ప్రమాదం జరిగిన రోజు అధికారులు స్పందించారని తరువాత ఎవరు పట్టించుకోవడం లేదని తెలిపారు. చికిత్సను బాగానే అందిస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి ఆర్థిక సహాయం ప్రభుత్వం నుండి అందలేదన్నారు. దీంతో గుణ సాయి కుమార్ కుటుంబం ఇబ్బంది పడుతుందని, తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



పత్తి కొనుగోళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పెంచికలపాడులోని సిసి కాటన్ మిల్లులో పత్తి పంటను కొనుగోలు కార్యక్రమాన్ని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కోడుమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకెపోగు సుగుణమ్మ, కోడుమూరు సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆకెపోగు జయన్న ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పత్తికొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యు బొగ్గుల దస్తగిరి

పరిసరాల పరిశుభ్రతపై అలసత్వం తగదు

ప్రజాశక్తి సిబెళగల్: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థాయి అధికారుల, సిబ్బంది, కార్మికులకు అలసత్వం ఏమాత్రం తగదని ఎంపిడిఒ రాణెమ్మ పేర్కొన్నారు. గురువారం ఈర్లదిన్నెలో మురుగు కాల్వలను, ధ్వంసమైన సిసి రోడ్లను, విద్యుత్ దీపాల కొరతను పర్యవేక్షణ చేశారు. పలు వీధుల్లో పరిసరాలుఅపరిశుభ్రంగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. వీధుల్లో విద్యుత్ లైట్లు వెలగడం లేదని, మురుగు సమస్యలు తలేత్తాయని పట్టించుకోవడం లేదన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశులు

బీసీ హాస్టల్‌ను పునరుద్ధరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో గత 40 ఏళ్లుగా ఉన్న బీసీ హాస్టల్‌ను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూసివేశారని, తక్షణమే ప్రభుత్వం బీసీ హాస్టల్‌ను పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో మూతపడిన హాస్టల్‌ను పరిశీలించి ఆయన మాట్లాడారు. చాలామంది మండలం కావాలని కోరుతున్నారని, ఇక్కడ ఉన్న హాస్టల్‌ను మూసివేసి ప్రభుత్వం పేద విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించిందని తెలిపారు. గత 40 సంవత్సరాలుగా చాలామంది విద్యార్థులు ఇక్కడ చదువుకుని వెళ్లారని, ప్రభుత్వం హాస్టల్‌ను మూసి వేయడంతో పేద విద్యార్థులకు నష్టం కలిగిస్తుందని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బీసీ హాస్టల్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి ఇ.లింగన్న, పెద్దతుంబలం మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, సిపిఎం నాయకులు దానప్ప పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

- గ్రామాన్ని సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి - కౌతాళం


వైద్య శిబిరంలో పాల్గొన్న డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి

మండలంలోని కరణి గ్రామంలో విష జ్వరాలు వ్యాపించడంతో వైద్యాధికారులు గురువారం కూడా వైద్య శిబిరాన్ని కొనసాగించారు. గ్రామంలో జ్వరాలతో, ఒంటి నొప్పులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సీజనల్ వ్యాధులు వ్యాపించడానికి కారణాలు కనుగొనడానికి ప్రజలు ఉపయోగిస్తున్న తాగు నీటిని ల్యాబ్ పరీక్షలకు పంపించారు. సర్పంచి పుష్పలత, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు ముమ్మరం చేసి గ్రామంలో పర్యటించారు.

అధికారులతో డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి సమీక్ష : కరణి గ్రామంలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి పర్యవేక్షించారు. ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, సర్పంచి సత్యవతి పంచాయతీ సిబ్బందితో సమీక్షించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి సరఫరాలో క్లోరినేషన్ చేయాలని సూచించారు. ప్రజలు కూడా ఇంటి బయట, లోపల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. రెండు, మూడు రోజులు జ్వరం ఉంటే వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని కోరారు. వైద్యులు అభిరూప్ పాల్గొన్నారు.

36 గృహ నిర్మాణాలకు ప్రభుత్వ అనుమతి

- డిప్యూటీ ఎంపిడిఒ రామాంజనేయులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం నుంచి 36 గృహ నిర్మాణాలకు అనుమతి వచ్చినట్లు డిప్యూటీ ఎంపిడిఒ రామాంజనేయులు తెలిపారు. గురువారం మండలంలోని చెట్నిహల్లి గ్రామంలో టిడిపి నాయకులు చేపల నాగేష్ ఆధ్వర్యంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి ఇళ్ల పట్టాలు కలిగిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. టిడిపి నాయకులు, సొసైటీ డైరెక్టర్ చేపల నాగేష్ మాట్లాడుతూ... గ్రామంలో గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి పట్టాలకు సంబంధించి ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారని తెలిపారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టాలని, లేకపోతే పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ సెక్రటరీ మహేష్, హౌసింగ్ ఎఇ వీరేంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భవానీ, గ్రామ పెద్దలు మేకల మల్లేష్, పూజారి మల్లేష్, వీరేష్, విద్యా కమిటీ ఛైర్మన్ పరమేష్, నరసింహులు, డీలర్లు గోపాల్, మల్లేష్ పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ

అగ్నిప్రమాదం జరిగిన ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులోని గోనె సంచుల దుకాణాన్ని ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి గురువారం పరిశీలించారు. సంఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులను పరామర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి కుట్ర కోణాలపైనా దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మల్లయ్య పాల్గొన్నారు.

శివారు కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని శివారు కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పి.ఎస్.రాధా కృష్ణ, సిపిఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి పి.గోవిందు, సిపిఎం పట్టణ నాయకులు రాముడు, సురేష్, రమేష్, లక్ష్మీనరసయ్య, కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, పారిశుధ్యం, వీధిలైట్లు వంటి సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకనుగుణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని చెప్పారు. శివారు కాలనీల్లోని ఎన్‌టిఆర్ కాలనీ, శివన్న నగర్, ఎస్సీ కాలనీ, హబీబ్ ముబారక్ నగర్, కొత్త మైనార్టీ కాలనీ, లింగాపురం రామయ్య కొట్టాల, సాయి గణేష్ నగర్, లక్ష్మీపేట, సంజీవ్ నగర్, ముగతి పేటలో తాగునీటి పైపులైన్లు, రోడ్లు, డ్రెయినేజీ అధ్వాన స్థితికి చేరాయని తెలిపారు. అలాగే టిడ్కో గృహ సముదాయాల వద్ద రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలన్నారు. రాఘవేంద్ర నగర్ గోనెగండ్ల బైపాస్ రోడ్డు, తాయమ్మ కాలనీ, ఎద్దుల మార్కెట్ వద్ద తాగునీటి పైపులైన్లు వేయాలని కోరారు. పాత ఎస్సీ కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. జనాభాకు అనుగుణంగా రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. సిపిఎం కార్యకర్తలు తిమ్మన్న, రాజు, లక్ష్మన్న, తిమ్మప్ప, ఆంథోని, నామాల రాముడు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

కదిలిన వలస బండి

- అప్పుల భారంతో తప్పని వలసలు

ప్రజాశక్తి - నందవరం


బొలెరో వాహనంలో వలస వెళ్తున్న ప్రజలు

మండలంలో వలస బండి కదిలింది. నందవరం గ్రామం నుంచి కూలీలు వలసబాట పట్టారు. ప్రతేడాది మాదిరిగానే ఈఏడాది కూడా నందవరం గ్రామం నుంచి ప్రజలు వలసబాట పట్టారు. అప్పుల భారంతో ప్రజలకు వలసలు తప్పడం లేదు. గత మూడేళ్లుగా వర్షాలు రాక అనావృష్టి ఏర్పడింది. ఈ ఏడాది విపరీతమైన వర్షాల తో అతివృష్టి నెలకొంది. అధిక వర్షాల వల్ల పంటల దిగుబడి అరకొరగా రావడంతో గ్రామంలో పంట పనులు ముగిశాయి. కూలి వెళ్లాలన్నా పనులు దొరకడం లేదు. పనులు దొరకక కూలీలు, అప్పుల భారంతో రైతులు వలస బాట పట్టక తప్పడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తమ జీవితా లు మారడం లేదని వలస కూలీలు కన్నీరు పెట్టుకున్నారు. అప్పులు తేవ డం పెట్టుబడి పెట్టడం, నష్టం రావడం.. వాటిని తీర్చడానికి వలస వెళ్లడం తమ జీవితాలకు అలవాటుగా మారిందని బాధను వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల భారంతో తప్పని వలసలు

- చాకలి భీమన్న



నిరంతర వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 8 ఎకరాల పొలంలో పత్తి పంట సాగు చేశాను. ఎకరా 5 కింటాళ్లు కూడా పత్తి రాలేదు. వచ్చిన పంటకు కూడా గిట్టుబాటు ధర లభించలేదు. కనీసం పెట్టుబడి కూడా రాలేదు. ప్రతేడాది మాదిరిగానే ఈఏడాది కూడా అప్పుల భారంతో వలసలు వెళ్లాల్సి వచ్చింది.

అయోమయంలో రైతుల జీవితాలు

- రైతు సంఘం నాయకులు దేవపుత్ర

రైతుల జీవితాలు అయోమయంలో పడిపోయాయి. పంట వేసినప్పటి నుంచి పంటను అమ్మే వరకు రైతు జీవితం గందరగోళంగా మారింది. వేసిన విత్తు మొలుస్తుందో లేదో, పంట సమయంలో వర్షం వస్తుందో.. రాదో, పండించిన పంటకు గిట్టబాటు ధర వస్తుందో.. రాదో అన్న ఆలోచనలతో రైతు నిరంతరం మానసికక్షోభతో జీవిస్తున్నాడు. అప్పుల భారం ఎక్కువై ఏమీ చేయలేని స్థితిలో కన్నీరు పెడుతూ పిల్లాపాపలను తీసుకుని వలస వెళ్తున్నారు.

పనులు చేసింది ఒకరు.. బిల్లులు మరొకరికి

- పెద్దగోనెహాళ్ పంచాయతీలో నిధుల దుర్వినియోగం
- ఎంపిడిఒను నిలదీసిన ఉప సర్పంచి భర్త

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న కొందరి అవినీతి అధికారుల్లో అలజడి రేపుతోంది. మార్లమాడికి పంచాయతీ కార్యదర్శి అవినీతి బాగోతం బయటకొచ్చి 24 గంటలు కాకముందే... ఇప్పుడు పెద్దగోనెహాల్ పంచాయతీ కార్యదర్శిగా గతంలో విధులు నిర్వహించిన మహ్మద్ షఫీ, సర్పంచి కొత్తింటి వెంకట్రామి రెడ్డి కలిసి ఉప సర్పంచి ధనలక్ష్మి చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చేసుకోవడంపై ధనలక్ష్మి భర్త వెంకట్రాముడు గురువారం ఎంపిడిఒ విజయ లలితతో వాగ్వాదానికి దిగారు. తమకు చెప్పకుండా పంచాయతీ డబ్బులు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. పెద్దగోనెహాళ్ పంచాయతీ కార్యదర్శిగా షఫీ.. అంతకుముందు విధులు నిర్వహిస్తున్నప్పుడు అభివృద్ధి పనులు చేయకుండా సర్పంచి కొత్తింటి వెంకటరామిరెడ్డితో కుమ్మక్కయి రూ.లక్షలు దోచేశారని వెంకట్రాముడు విమర్శించారు. పంచాయతీ నిధులు ఏ రోజున ఎంత విత్ డ్రా చేశారో సంబంధిత పత్రాలతో సహా ఎంపిడిఒ ముందుంచారు. రూ.1.95 లక్షల విలువ గల పనిని చేశానని, మరో రూ.1.40 లక్షల విలువగల పనులు తాను చేశానంటూ, గ్రామంలో అంతకుమించి ఎలాంటి అభివృద్ధి పనులూ జరగలేదని, అలాంటిది రూ.15 లక్షలకు పైగా పంచాయతీ నిధులను ఎలా విత్ డ్రా చేసుకుంటారని నిలదీశారు. రూ.1.50 లక్షలు మాత్రమే తన చేతికొచ్చాయని, రూ.2.20 లక్షలు పంచాయతీ కార్యదర్శి షఫీ బిల్లు పెట్టుకుని మిగతా డబ్బు మింగేశారని మండిపడ్డారు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పంచాయతీ నిధులు దోచేస్తున్నారని విమర్శించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరిశీలించి దుర్వినియోగమయిన పంచాయతీ నిధులను తిరిగి వసూలు చేసుకోవాలని కోరారు.


ఎంపిడిఒతో వాగ్వాదానికి దిగిన వెంకట్రాముడు

ఆరోగ్యశ్రీని పునరుద్ధరించాలి

- వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మాబుసాబ్

ప్రజాశక్తి - కౌతాళం



రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని వైసిపి మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బి.మాబుసాబ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడారు. ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ సేవలు అనేక ఆస్పత్రుల్లో అమలు కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది నిరుపేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో బిల్లులు చెల్లించలేక సతమతమవుతున్నారని, సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక కుమిలిపోతున్నారని చెప్పారు. ప్రజల ఇబ్బందులు, ఆర్థిక సమస్యలను గుర్తించి, ఆరోగ్యశ్రీ సేవలను అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆరోగ్యశ్రీని పునరుద్ధరించి నిరుపేదలను ఆదుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి డిమాండ్ చేశారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరుగుతుండగా సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఉన్న ఎంపిపి రంగమ్మ, ఎంపిడిఒ మద్దిలేటి స్వామి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులకు ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండలంలో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, చుక్క నీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉందని తెలిపారు. ఫిల్టర్ వాటర్ కొని తాగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అధికారులు ప్రజాసమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మండలంలో ఆలూరు నుంచి ఎల్లార్తి, ఆలూరు నుంచి పెద్దహోతూరు, మరకట్టు నుంచి పెద్దహోతూరు, ముసానహల్లి నుంచి చాగి వరకు రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని చెప్పారు. రోడ్లన్నీ గుంతలు పడి ప్రయాణానికి అసౌకర్యంగా ఉన్నాయన్నారు. గుంతల రోడ్లలో ప్రయాణించడం వల్ల అనేకమంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, గాయాలపాలయ్యారని తెలిపారు. ఆలూరులో సిద్ధేశ్వర, సిపిఎం కాలనీల్లో వీధిలైట్లు వేయాలని, గ్రామాల్లోని డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడికను తీసి, బ్లీచింగ్ పౌడర్ వేయాలని డిమాండ్ చేశారు. ఆలూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాల మరమ్మతు పనులు చేపట్టాలని, పూర్తయిన పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించాలని కోరారు. ఎంపిడిఒ షాపింగ్ కాంప్లెక్స్‌ను టెండర్ ద్వారా ఉపయోగంలోకి తేవాలని, నిర్మాణం పూర్తయిన ఆలూరు సిహెచ్‌సిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సిద్ధేశ్వర కాలనీలో కొట్టాలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని, సిసి రోడ్లు వేయాలని, చెడిపోయిన చేతి పంపులకు మరమ్మతులు చేయాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ మద్దిలేటి స్వామికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల నాయకులు మైనా, కృష్ణ, ఈశ్వర్ గౌడ్, శేఖర్, బసవరాజు, చంద్ర, ఉమేష్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సర్వసభ్య సమావేశంలో సమస్యలు వెల్లువ

ప్రజాశక్తి -ఆలూరు

ఆలూరు మండల సర్వసభ్య ఆఖరి సమావేశంలో సమస్యలు వెల్లువెత్తాయి. గురువారం ఆలూరు ఎంపిపి రంగమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈనెల 23న జరగాల్సిన సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రజా ప్రతినిధులకు ఎంత మక్కువ ఉందోనని ప్రజాశక్తిలో వార్త ప్రచురించడంతో ఈ సమావేశానికి అత్యధికంగా హాజరయ్యారు. ఎంపిటిసిలు, సర్పంచులు మాట్లాడుతూ... చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వర్షాలు, ఎల్ఎల్‌సి నీరు సమృద్ధిగా ఉన్న గ్రామాల్లో 10 నుంచి 20 రోజులకోసారి తాగునీరు వస్తున్నాయని తెలిపారు. సచివాలయాల్లో ప్రజలకు ఎటువంటి సేవలూ అందడం లేదని చెప్పారు. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని ఎంపిపి దృష్టికి తీసుకొచ్చారు. ఎంపిడిఒ మద్దిలేటి స్వామి మాట్లాడుతూ... తాగునీటి మోటార్ పంపులు కాలిపోవడంతో ఇబ్బందులు తలెత్తాయని, నీరు సమగ్రంగా వదలాలని వాటర్ మెన్‌కు కూడా తెలిపామని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.30 లక్షలు మంజూరయినటుల తెలిపారు. త్వరలోనే తీర్మానం చేసి పనులు చేపడతామని వివరించారు.



మాట్లాడుతున్న అధికారులు


మౌలిక సదుపాయాల కల్పనతో అభివృద్ధి

- పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతాం
- మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణం అభివృద్ధి చెందాలంటే రోడ్లు, డ్రెయినేజీ, మౌలిక సదుపాయాల కల్పన జరగాలని మున్సిపల్ ఛైర్మన్ సిహెచ్.లోకేశ్వరి తెలిపారు. గురువారం ఛైర్మన్ లోకేశ్వరి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణ శివారు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం జరగాలని తెలిపారు. కొన్నిచోట్ల పనులు మంజూరయి టెండర్ల ప్రక్రియ ముగిసినా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టెండర్లలో పనులు దక్కించుకుని ఇంతవరకు పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. కౌన్సిలర్ ఫయాజ్ మాట్లాడుతూ... వార్డులో రూ.12 లక్షలతో రోడ్లు వేయిస్తామని చెప్పారని, ఇంతవరకు పనులు మొదలు కాలేదని తెలిపారు. మరుగుదొడ్లు మంజూరయి నెలలు గడిచినా కాంట్రాక్టర్లు పనులు చేపట్టలేదన్నారు. కౌన్సిలర్ హసీనా బేగం మాట్లాడుతూ... వార్డులో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని అధికారులు ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదన్నారు. సుమారు రూ.35 లక్షల పనులకు టెండర్లు జరిగాయని, కాంట్రాక్టర్ సక్రమంగా పనులు చేయకుండా మధ్యలో నిలిపివేయడం ఏమిటని, చొరవ చూపాలని ఛైర్మన్‌కు విన్నవించారు. ఛైర్మన్ మాట్లాడుతూ... అన్ని వార్డుల్లోనూ పనులు చేసేందుకు ప్రణాళిక రూపొందించామని, ఒకే వార్డులోనే లక్షలాది రూపాయలతో పనులు చేయాలంటే కుదరదని కౌన్సిలర్ హసీనాపై అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య మాటామాట పెరిగింది. కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ... బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు తాత్కాలిక మరమ్మతులు పనులు మొదలయ్యాయని, సుమారు రూ.1.20 కోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. 90 రోజుల్లో పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నామన్నారు. డిసెంబర్ 15 వరకు ఎల్ఎల్‌సిలో నీటి ప్రవాహం ఉంటుందని అధికారులు తెలిపారన్నారు. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మరమ్మతుల కారణంగా నీటి నిల్వకు అవకాశం లేదని, వేసవిలో నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... నీటి ఎద్దడి రాకుండా బోర్లు వేయాలని, చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. కౌన్సిలర్ సందీప్ రెడ్డి మాట్లాడుతూ... ఎస్ఎస్ ట్యాంకు పటిష్టతకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.70 కోట్లు మంజూరయ్యాయని తెలిపారని, ఎప్పటిలోపు నిధులు వస్తాయో చెప్పాలని కమిషనర్‌ను కోరారు. కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ... ముస్లింలు ఉండే 1వ వార్డు ప్రాంతంలో తాగునీటి పైపులైను ఏర్పాటు చేయాలని కోరుతున్నా ఎందుకు చేయడం లేదని నిలదీశారు. కౌన్సిలర్ లక్ష్మీ మాట్లాడుతూ... సెప్టిక్ ట్యాంకు నిండి మురుగు కాలువల్లో వ్యర్థాలు వెళుతున్నాయని, మరమ్మతులు చేయించాలని తెలిపారు. మరుగుదొడ్లకు తలుపులు బిగించాలని కోరారు. కౌన్సిలర్ చలపతి మాట్లాడుతూ... జంగిల్ తొలగింపునకు రూ.లక్షలు వెచ్చించడం తగదని, పారిశుధ్య కార్మికులతో పనులు చేపట్టాలని కోరారు. కౌన్సిలర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ... ఇఎస్ఐ ఆస్పత్రి సమీపంలో డ్రెయినేజీ లేక వర్షపు నీరు రోడ్లపైనే నిలుస్తోందని, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ... కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన అజెండా కాపీని గత రాత్రి ఇవ్వడం ఏమిటని నిలదీశారు. కౌన్సిలర్లంటే అధికారులకు చిన్నచూపా అని, పద్ధతి మార్చుకోవాలని కోరారు. అధికారులను ఏమీ అనరాదని ఛైర్మన్ వెనకేసుకురావడం తగదన్నారు. ఒక దశలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దశలవారీగా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ తెల్చి చెప్పారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుల నియామకానికి సంబంధించిన అంశాన్ని మరోసారి వాయిదా వేశారు. ఉద్యోగాల కోసం డబ్బు వసూలు చేశారని ఆరోపణలు రావడంతో గతంలో వైసిపి కౌన్సిలర్లే వాయిదా వేశారు. అప్పటి నుంచి ఆ సమస్య పెండింగ్‌లోనే ఉంది. ప్రస్తుతం కౌన్సిలర్లు సమ్మతించిన బడ్జెట్ లేదని, వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి నియామకాలు చేపడతామని అధికారులు అజెండాలో రూపొందించారు. వచ్చే నెల 1న విధుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని ఛైర్మన్ లోకేశ్వరి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఇంజినీర్ సత్యనారాయణ, డిఇలు రామ్మూర్తి, గోపీనాథ్, చలపతి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్, అకౌంట్ ఆఫీసర్ రవికుమార్, రెవెన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్, వైస్ ఛైర్మన్ మహ్మద్ గౌస్, కౌన్సిలర్లు లలితమ్మ, పద్మావతి, ఇందు, కీర్తన, లక్ష్మి, చిన్న, అశోక్, ఇంతియాజ్, ఉస్మాన్, యాసీన్, మెప్మా ఆఫీసర్ వీరారెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ ఉన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్

ప్రతి ఒక్కరికీ అక్షర జ్ఞానం

- ఎంపిడిఒ అల్లా బకాష్, ఎంఇఒ సావిత్రమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి


అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ అక్షరజ్ఞానం పెంపొందించుకోవాలని ఎంపిడిఒ అల్లా బకాష్, ఎంఇఒ సావిత్రమ్మ తెలిపారు. గురువారం మండ ల కార్యాలయంలో 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' కార్యక్రమంపై ఎన్‌ఆర్‌ఇజిఎస్, వాలంటీరు టీచర్లకు ఏపీవో జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ, ఎంఇఒ మాట్లాడు తూ... మండలంలో ఉపాధి హామీ కూలీలందరూ తప్పనిసరిగా ఈ వయోజన విద్యా కార్యక్రమంలో పాల్గొని అక్షరాభ్యాసం నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం శిక్షణ నిర్వాహకులు, జిల్లా వయోజన విద్యా సూపర్‌వైజర్ కె.రమణయ్య మాట్లాడుతూ... మండలంలో 1,570 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. వాలంటీరు టీచర్లకు గ్రామాల్లో ఇచ్చిన లక్ష్యం ప్రకారం చదువు చెప్పాలని, మండలంలోని నిరక్షరాస్యులకు చదవడం, రాయడం చిన్నచిన్న లెక్కలు చేయడం వంటివి నేర్పించాలని చెప్పారు. ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత గురించి అవగాహన కల్పించాలన్నారు. రోజూ సాయంత్రం ఒక గంట పాటు చదువు నేర్పించాలన్నారు. చదువు నేర్చుకున్న పురుషులకు మార్చిలో ఎన్ఐఒఎస్ పరీక్ష ఉంటుందని, ఆ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు.

'క్షయ నివారణ సాధ్యమే'

లప్రజాశక్తి - ఆదోని

క్షయ వ్యాధి నివారణ లక్ష్యంగా పని చేయాలని మెడికల్ హెల్త్ ఆఫీసర్ షేకున్ భాను తెలిపారు. గురువారం పట్టణంలోని అరుణ్ జ్యోతి నగర్ హెల్త్ సెంటర్ పరిధిలో అంబేద్కర్ నగర్ ప్రాంతంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖాధికారులు బాబు రాజు, సుబ్బమ్మ బాయి, హెల్త్ ఎన్ఎంఎ ధరణి, ఆశాలు పద్మావతి, జ్యోతి, మంజుల, సరోజ ఉన్నారు.

పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్ : ఎంపీ

ప్రజాశక్తి - ఆస్పరి


చెక్కును అందజేస్తున్న ఎంపీ

నిరుపేద కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ వరమని ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. గురువారం మండలంలోని జొహరాపురం గ్రామానికి చెందిన తలారి విమల్ నాయుడు, వరలక్ష్మి దంపతులకు ఇటీవల కవల పిల్లలు జన్మించారు. ఆ శిశువులు అనారోగ్యానికి గురి కావడంతో ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఈ నిరుపేద కుటుంబం రూ.2 లక్షల దాకా వైద్య ఖర్చులు పెట్టారు. ఈ విషయాన్ని కురువ కార్పొరేషన్ డైరెక్టర్ కెసి.ఉదయ్ కుమార్ దృష్టికి తీసుకెవెళ్లగా ఆయన స్పందించి ఈ విషయాన్ని ఎంపీ దగ్గరకు వెళ్లి నివేదించారు. ఎంపీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆ కుటుంబానికి రూ.65 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు మంజూరు కావడంతో గురువారం లబ్ధిదారులకు అందజేశారు.

అవినీతి నిర్మూలనకు కృషి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - గోనెగండ్ల

అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని ఎంపిడిఒ మణిమంజరి తెలిపారు. గురువారం గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో అవినీతి నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలని, అన్ని సమయాల్లోనూ నిజాయితీగా, సమగ్రత ప్రమాణాలకు కట్టుబడి ఉండాలని తెలిపారు. అనంతరం జీవితంలో అన్ని రంగాల్లోనూ నిజాయితీగా, చట్ట నిబంధనలను అనుసరిస్తామని, లంచం ఇవ్వబోమని, తీసుకోమని, అన్ని పనులను నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహిస్తామని, ఏదైనా అవినీతి సంఘటనను తగిన ఏజెన్సీకి తెలియజేస్తామని కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రతిజ్ఞ చేయించారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది

'పిపిపి'ని రద్దు చేయాలి : వైసిపి

ప్రజాశక్తి - కౌతాళం

కూటమి ప్రభుత్వం తెచ్చిన పిపిపి విధానాన్ని రద్దు చేయాలని వైసిపి మండల ప్రధాన కార్యదర్శి గురునాథ్ రెడ్డి, సర్పంచి శిల్పారెడ్డి కోరారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం బాపురం గ్రామంలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పిపిపి విధానం వల్ల కలిగే నష్టాలను వివరించారు. విద్య, వైద్య రంగాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైసిపి నాయకులు జైపాల్ పాల్గొన్నారు.

విచారణ అధికారిగా అవినీతి అధికారి..!

- సబబేనా..? : మండల ప్రజలు

ప్రజాశక్తి - హొళగుంద

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డిప్యూటీ ఎంపిడిఒ చక్రవర్తిని మార్లమాడికి పంచాయతీ కార్యదర్శి అవినీతి బాగోతంపై విచారణ అధికారిగా నియమించడం సబబేనా అంటూ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. మార్లమాడికి పంచాయతీ నిధుల స్వాహాలో ఈయన కూడా కీలక పాత్ర వహించడం వల్ల విచారణ నీరుగారే ప్రమాదం ఉందని ఎపి దళిత సమాఖ్య మండల అధ్యక్షులు నల్ల మల్లేష్, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్ గురువారం అనుమానం వ్యక్తం చేశారు. మార్లమాడికి పంచాయతీ కార్యదర్శి అవినీతికి పాల్పడినట్లు పత్రికలో వచ్చిన కథనానికి ఎంపిడిఒ విజయ లలిత స్పందించారు. ఈ విషయంలో విచారణ అధికారిగా డిప్యూటీ ఎంపిడిఒ చక్రవర్తిని నియమించారు. ఈయన అవినీతి, మద్యం తాగి విధులకు హాజరవుతున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికారులు స్పందించి మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ అభివృద్ధి పనులపై విచారణ చేస్తే కొన్ని రూ.కోట్లు పక్కదారి పట్టినట్లు తెలుస్తుంది. ఈ విషయంపై ఎంపిడిఒ విజయ లలితను వివరణ కోరగా... డిప్యూటీ ఎంపిడిఒ చక్రవర్తిని విచారణ అధికారిగా నియమించామని, విచారణ అనంతరం తాను కూడా గ్రామంలో వెళ్లి విచారణ చేస్తానని తెలిపారు.

దొంగలు ఎత్తుకెళ్లిన కారు స్వాధీనం

- ఛేదించి కారును పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈఏడాది జనవరిలో శ్రీనీలకంఠేశ్వర స్వామి రథోత్సవం చూడటానికి మామిడాల ఆంజనేయులు కుటుంబ సమేతంగా తన ఇన్నోవా క్రిష్ట టిఎస్09 ఎఫ్‌యు 2367 వాహనంలో వచ్చారు. రథోత్సవాన్ని కుటుంబంతో కలిసి చూసే సమయంలో తన ఇన్నోవా కారును స్థానిక ప్రభుత్వాస్పత్రి రోడ్డులో పక్కన పార్కు చేసి రథోత్సవాన్ని చూడడానికి వెళ్లారు. రథోత్సవంలో ఇన్నోవా కారును దొంగలించారు. చుట్టుపక్కల ఎంత వెతికినా ఎలాంటి సమాచారం లేకపోవడంతో జనవరి 16న పట్టణ పోలీసు స్టేషన్లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు దానిని సవాలుగా తీసుకొని ఎస్పీ శ్రీకాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎన్.భార్గవి ఆధ్వర్యంలో సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. ఎలాంటి ఆధారాలూ లేకపోయినప్పటికీ పట్టణంలోని ముఖ్య కూడళ్లలో సిసి టీవీ కెమెరాలను పర్యవేక్షించి, టోల్ ప్లాజా వద్ద నుంచి సిసి ఫుటేజ్‌లను సేకరించుకుని సాంకేతిక పరిజ్ఞానం జోడించుకొని, దంపులును సమీక్షించి ఇతర రాష్ట్రాల్లో కేసు వివరాలను సేకరించారు. మహారాష్ట్రలో బీడ్ జిల్లాకు చెందిన ఆరుగురు నిందితుల ఆచూకీ కనిపెట్టారు. వారిని అరెస్టు చేసి వారు దొంగలించిన ఇన్నోవా క్రిష్ట కారును రికవరీ చేశారు. కేసులో భాగస్వాములై కేసును ఛేదించిన పట్టణ సిఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలియజేశారు. కేసు దర్యాప్తు నిమిత్తం మహారాష్ట్రకు వెళ్లిన ప్రతిసారీ ఎస్పీ మహారాష్ట్రలోని సంబంధిత ఏరియా అధికారులతో మాట్లాడి కేసు పురోగతికి ఎంతో సహకరించినందుకు పట్టణ పోలీసులు ఎస్పీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



మాట్లాడుతున్న పట్టణ సిఐ శ్రీనివాసులు

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజా రమేష్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని కాటికాపరుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కలగుట్ల రాజా రమేష్, మండల అధ్యక్షులు గుడేకల్ ఆనంద్, కెవిపిఎస్ నాయకులు చిన్నప్ప, ఎస్.తిమ్మన్న డిమాండ్ చేశారు. గురువారం డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ నాయకులు కలగొట్ల రంగన్న, సోగనూర్ రాముడు, డివైఎఫ్ఐ నాయకులు రవి, దినకర్ పాల్గొన్నారు.


డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వ్యాసరచన పోటీల్లో వీరేంద్ర ప్రతిభ : ఎంఇఒ

ప్రజాశక్తి - మంత్రాలయం

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నియోజక వర్గస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పెద్దకడబూరుకు చెందిన 9వ తరగతి విద్యార్థి సాలె వీరేంద్ర ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచారని ఎంఇఒ రాఘన్న తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. నవంబర్ 2న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నియోజక వర్గ స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. కౌతాళం, పెద్దకడబూరు, మంత్రాలయం, కోసిగి మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 12 మంది విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పెద్దకడబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సాలె వీరేంద్ర ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. న్యాయ నిర్ణేతలుగా జూనియర్ కళాశాల అధ్యాపకులు మద్దిలేటి, చిలకలడోణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్ వ్యవహరించారు. తొలి స్థానం కైవసం చేసుకున్న విద్యార్థి వీరేంద్రను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, మాధవరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు భోజరాజు, ఉపాధ్యాయులు నల్లారెడ్డి, బసవరాజు, రామచంద్ర, నాగరాజు, సువర్ణ జోషితో కలిసి అభినందించామని చెప్పారు. రవీంద్ర అమరావతిలో జరగనున్న పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఎంఇఒ

రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన

- ప్రభుత్వాస్పత్రి గైనకాలజిస్టు మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

రొమ్ము కణాల్లో డిఎన్ఎ మార్పులు, పరివర్తనాల వల్ల రొమ్ము క్యాన్సర్ వస్తుందని, మహిళలు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వాస్పత్రి గైనకాలజిస్ట్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆవోపా, వామ్, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన నిర్వహించారు. కణాల అనియంత్రత పెరుగుదలకు దారితీస్తుందన్నారు. ఈ క్యాన్సర్ కణితులను తొలగించడానికి శస్త్ర చికిత్స, కీమోథెరపీ, లేదా హార్మోన్ థెరపీ వంటి చికిత్సలు ఉన్నాయని తెలిపారు. సదస్సుకు ఐఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఛార్జి, ఆవోపా వామ్ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ కార్యదర్శి వంకదారు శ్రీనాథ్ గుప్తా, నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరాజ్, గైనకాలజిస్టు డాక్టర్ కీర్తి, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ విజయభారతి, డాక్టర్ మౌనిక, డాక్టర్ భారతి, ఆవోపా కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ప్రతాప్ ఈరన్న శెట్టి, నగరికంటి వెంకటేష్ బాబు ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డి


సచివాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబలం గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నాయకులు కోరారు. గురువారం స్థానిక సచివాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న మాట్లాడారు. పెద్దతుంబలం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రోడ్డులోని విద్యానగర్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, వీధిలైట్లు వేయాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి పెద్దతుంబలం ఎస్ఎస్ ట్యాంకు వెడల్పు చేయాలని, సంతేకుడ్లూరు దగ్గర నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకు నుంచి పెద్దహరివాణం వరకు పైపులైన్ వేయాలని తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు డి.రామాంజనేయులు, పెద్దతుంబలం మాజీ సర్పంచి కృష్ణమూర్తి, సిపిఎం మండల నాయకులు అయ్యన్న, సిపిఎం సభ్యులు లక్ష్మన్న, దాసప్ప, గర్జప్ప పాల్గొన్నారు.

సిసి రోడ్డు, డ్రెయినేజీని పూర్తి చేయాలి

- హత్తిబెళగల్ గ్రామస్తులు


విన్నవిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -ఆలూరు

హత్తిబెళగల్ గ్రామంలోని పంచాయతీ పక్కనున్న కాలనీలో గతేడాది వేసిన రోడ్డు నుంచి పెండింగ్‌లో ఉన్న 100 మీటర్ల రోడ్డును పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు. గురువారం ఎంపిడిఒ మద్దిలేటి స్వామికి వినతిపత్రం అందజేశారు. ఎంపిడిఒ స్పందిస్తూ... ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్ లీలా గ్రామానికి చేరుకుని పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్డు, డ్రెయినేజీకి ఎస్టిమేషన్ వేసేందుకు పరిశీలించారు. గతేడాది నుంచి పెండింగ్‌లో ఉండడంతో డ్రెయినేజీ నీటితో వచ్చే దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు తెలిపారు.

వెల్ఫేర్ సెక్రటరీ మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలోని వడ్డెర సంఘం ఏరియా సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పని చేస్తున్న హనుమంతయ్య బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హనుమంతయ్య మృతికి సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం తరపున అంత్యక్రియల నిమిత్తం రూ.25 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వివిధ గ్రామ/వార్డు సచివాలయాల నుంచి సమకూరిన రూ.52 వేల ఆర్థిక సహాయాన్ని కూడా కుటుంబానికి అందజేశారు.



సంతాపం తెలుపుతున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

పిఎఫ్, పింఛను బకాయిలు చెల్లిస్తాం

- రాయ మిల్లు డైరెక్టర్లు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని రాయ మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు హామీ ఇచ్చారు. పిఎఫ్ చెల్లించాలని గత మూడు రోజులుగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మిల్లు ముందు రిలే దీక్షలు చేపట్టారు. గురువారం న్యాయవాది జీవన్ సింగ్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు భాస్కర్ రెడ్డి, మింటు అగర్వాల్ చేరుకొని చర్చలు జరిపారు. వచ్చేనెల ఆఖరిలోపు 200 మంది కార్మికులకు రావాల్సిన పిఎఫ్ రూ.85.17 లక్షల పైచిలుకు చెల్లిస్తామని శిబిరంలో హామీ ఇచ్చారు. పెనాల్టీ ఏమైనా ఉన్నా తామే చెల్లించి పిఎఫ్ మొత్తం కార్మికులకు ఖాతాల్లో జమ అయ్యేలా చూస్తామని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ... పట్టణంలో వేలాదిమంది కార్మికుల జీవనాధారమైన మూడు స్పిన్నింగ్ మిల్లులు మూతపడ్డాయని, వీటిపై ఆధారపడిన వేలాదిమంది కార్మికులు వీధినపడ్డారని తెలిపారు. పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి మణి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు చెన్నప్ప, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు అఖండ మాట్లాడారు. మిల్లు మూతపడి 25 ఏళ్లయిందని, కొంత మంది కార్మికులు అనారోగ్యం, వృద్ధాప్యంతో చనిపోయినా యాజమాన్యం బకాయిలు స్పందించలేదని తెలిపారు. ఐఎఫ్‌టియు మండల నాయకులు సౌరప్ప, కుమార్, నారాయణ, మల్లి, ఖాదర్, టిఎన్‌టియుసి నాయకుడు ఇస్వీ మల్లికార్జున, లింగన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మిల్లు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి